'రైతులపై ఎర్రబెల్లి, హరీశ్‌రావులది కపట ప్రేమ'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి

పాలకుర్తి, న్యూస్‌టుడే: చెప్పే చరిత్ర భారాస నాయకులదని.. చేసే చరిత్ర కాంగ్రెస్‌దని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. కాంగ్రెస్‌పై బురద చల్లే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. పాలకుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రులు దయాకర్‌రావు, హరీశ్‌రావులు రైతులపై కపట ప్రేమ చూపిస్తూ మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. రైతులకు కాంగ్రెస్ పార్టే పెద్దపీట వేసిందన్నారు. వయసులో తనకంటే పెద్దవారైన దయాకర్‌రావు.. సలహాలు సూచనలిస్తే స్వీకరిస్తానన్నారు. గతంలో పాలకుర్తిలో రుణ మాఫీ గురించి అడిగిన రైతులను దయాకర్‌రావు పోలీసులతో గెంటించారన్నారు. 'అప్పుడు గుర్తుకు రాని రైతులు.. ఇప్పుడు గుర్తొచ్చారా' అని ప్రశ్నించారు. హరీశ్‌రావు మొదట మల్లన్నసాగర్ రైతుల వద్దకు వెళ్లి మాట్లాడితే బాగుంటుందని, పాలకుర్తికి వచ్చే ముందు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. పంటల బీమా పథకాన్ని రద్దు చేసిందే భారాస అని.. దొడ్డు బియ్యం ఇవ్వొద్దని చెప్పింది ఆ పార్టీ నాయకులేనన్నారు. ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామన్నారు. సాంకేతిక కారణాలతో కొందరు రైతులకు రుణ మాఫీ కాలేదని, ఆ సమస్యను పరిష్కరించి రైతులకు డబ్బులందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన చండీ హోమంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని పూజలు చేశారు. బ్లాక్ అధ్యక్షుడు సత్యనారాయణ, మండలాధ్యక్షులు కుమారస్వామి, ఆమ్యా నాయక్, నల్ల శ్రీరామ్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రాఘవరావు, తిరుపతిరెడ్డి, యాకాంతరావు తదితరులు పాల్గొన్నారు.

పండగ ప్రత్యేకం.. సంప్రదాయాల మమేకం

ఆదివారం ప్రత్యేకం

దసరా, సద్దుల బతుకమ్మ పండగల పేర్లు చెబితే ఎక్కడలేని సంతోషం కలుగుతుంది... ఎక్కడెక్కడో స్థిరపడినవారంతా.. సొంతూళ్లకు సంతోషంగా తరలివస్తారు.. బడులు, కళాశాలలకు సెలవు రావడంతో పిల్లలంతా అమ్మమ్మ, నానమ్మ ఇళ్లకు వచ్చి హాయిగా ఆటలాడతారు.. ఎంగిలిపూల బతుకమ్మ మొదలుకొని దసరా వరకు పల్లెల్లో బోలెడంత సందడి కనిపిస్తుంది. మహిళలంతా గుళ్లల్లో, చెరువు కట్టల వద్ద బతుకమ్మ ఆటపాటలతో అలరిస్తారు. ఇక ఓరుగల్లు ప్రాంతంలో ఈ పండగను కొన్ని ఊళ్లల్లో మరింత ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు.. ఆ విశేషాలతో 'ఈనాడు' కథనమిది..

–ఈనాడు, వరంగల్

అదిగదిగో మా ఊరు..
దసరా వచ్చిందంటే దాని తీరేవేరు..
అన్నాతమ్మీ అంటూ ఆత్మీయ పలకరింపులు
వదినా మరదళ్ల నవ్వుల తుళ్లింతలు..
గునుగు తంగేడు సోయగాలతో బతుకమ్మ ఆటలు..
ఉయ్యాలో.. రామ ఉయ్యాలో.. అంటూ ఆడపడుచుల పాటలు..
బంతి పూలు, మామిడాకులతో స్వాగతం పలికే గుమ్మాలు..
కమ్మని పిండివంటలతో ఇంటింటా ఘుమఘుమలు..
పట్టు పరికిణీల్లో సందడిచేసే పడుచు పిల్లలు..
జమ్మిచెట్టు వద్ద ఆత్మీయ ఆలింగనాలు..
అందుకే పట్నంవారంతా పల్లెబాట పడతారు..
ఎవరికివారు.. ఊళ్లల్లో
'ప్రత్యేకత'ను చాటుతున్నారు.

ఉప్పొంగే దేశభక్తి




దేశమంతా పంద్రాగస్టు, 26 జనవరి, తదితర రోజుల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. మహబూబాబాద్ జిల్లా గార్లలో మాత్రం దసరా రోజున నెలవంకను పోలిన జెండాను ఎగురవేయడం ఆనవాయితీగా వస్తోంది. గార్లలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న క్రమంలో ఆ వీధిని జెండా బజారుగా పిలుస్తున్నారు. పండగ రోజు పంచాయతీ నుంచి ఊరేగింపుగా జెండాను తీసుకెళ్లి మసీదు సెంటర్‌లో ఎగురవేస్తారు. అనంతరం తూర్పాంజనేయ స్వామి ఆలయంలో శమీ పూజ చేస్తారు.

సరిహద్దు నుంచి సొంతూరుకు

వరంగల్ జిల్లా నర్సంపేటలో అన్ని ప్రాంతాల్లోలాగే వేడుకలు ఎంతో ఉత్సాహంగా చేస్తారు. హైదరాబాద్, వరంగల్ తదితర ప్రాంతాల్లో స్థిరపడ్డవారే కాదు సరిహద్దులో ఉన్న సైనికులు తప్పకుండా వస్తారు.. నర్సంపేటకు చెందినవారు సుమారు 30 మందికిపైగా సైన్యంలో సేవలందిస్తున్నారు.

భారీ రావణ వధ





వరంగల్ ఉర్సుగుట్ట రంగలీలా మైదానంలో దసరా వేడుకలు కోలాహలంగా జరుగుతాయి. లక్షకుపైగా జనం హాజరై వేడుకల్ని తిలకిస్తారు. 65 అడుగుల రావణాసురుడి బొమ్మ తయారుచేస్తారు. అనంతరం బాణసంచాతో పేల్చేస్తారు. దసరా నాడు స్థానిక ఆర్య సమాజ్ నుంచి ఎడ్లబండిపై సీతారాముల వేషధారణలో కళాకారులను తీసుకొస్తారు. ముందు రంగస్థల కళాకారులు చిరుతల భజన చేస్తూ ఊరేగింపుగా తరలివస్తారు. వీరికి ఉత్సవ కమిటీ స్వాగతం పలుకుతుంది. అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాక చివరకు రావణవధ ఉంటుంది. ఇదెంతో కనువిందు కలిగించే ఘట్టం. కర్ణాటకలోని మైసూరు తర్వాత అంత కోలాహలంగా వేడుకలు జరిగేది ఇక్కడే అని స్థానికులు చెబుతారు.

వందేళ్ల నాటి జమ్మిచెట్టు



పాండవులు అరణ్యవాసం సమయంలో జమ్మిచెట్టుపై ఆయుధాలు పెట్టారని, ఆ తర్వాత చెట్టుమీద నుంచి తీసి యుద్ధానికి వెళ్తే. విజయం కలిగిందని పురాణ ప్రతీతి.. అందుకే ప్రతి ఊళ్లో దసరా రోజు గ్రామస్థులంతా జమ్మి చెట్టుకు పూజ చేయడం ఆనవాయితీ.. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామంలో సుమారు వందేళ్ల జమ్మి వృక్షం ఉంది. పండగ రోజు సాయంత్రం ఊరివారంతా డప్పుచప్పుళ్లతో పెద్ద గంపలో సొరకాయ, సజ్జ, జొన్న మొక్కలను పట్టుకుని దసరా బండ వద్దకు చేరుకుంటారు. అక్కడ కొత్తగా నిర్మించిన పాకలో సొరకాయకు పూజ చేస్తారు. అనంతరం జంతు బలికి బదులు సొరకాయను కోస్తారు. చారిత్రక జమ్మి చెట్టు వద్దకు వెళ్లి కంకణాలు కట్టుకొని పూజలు చేస్తారు.

అయిదో రోజు అద్భుతంగా



బతుకమ్మ పండగ అంటే సాధారణంగా మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ, చివరి రోజు సద్దుల బతుకమ్మను ఊరూవాడా సందడిగా చేస్తారు. మహబూబాబాద్ జిల్లావ్యాప్తంగా అనేక గ్రామాల్లో అయిదో రోజు కూడా బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహిస్తారు. భారీ పరిమాణంలో బతుకమ్మలను పూలతో పేర్చి మహిళలు బతుకమ్మలు ఆడి అనంతరం చెరువులో నిమజ్జనం చేస్తారు.

ఖరీఫ్ సీజన్ కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి

జనగామ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్

ముఖాముఖి



జనగామ, న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్ ధాన్యం ఇతర వ్యవసాయ ఉత్పత్తుల క్రయ, విక్రయాలకు మార్కెట్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జనగామ వ్యవసాయ విపణి కార్యదర్శి శ్రీనివాస్ వివరించారు. గతానుభవాల నేపథ్యంలో ప్రైవేటు క్రయ, విక్రయాల్లో రైతులకు అన్యాయం జరగకుండా, నాణ్యతకు అనుగుణంగా ధర లభించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ నెల ఒకటి నుంచి కొత్త మద్దతు ధరలు అమలు, వేళలు, కొనుగోళ్ల క్రమబద్ధీకరణ, ఇతర అంశాలపై 'న్యూస్‌టుడే' ఆయనతో 'ముఖాముఖి' జరిపింది.

ప్రశ్న: గతానుభవాల నేపథ్యంలో యార్డులో ఎలాంటి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు?..

కార్యదర్శి శ్రీనివాస్: గత రబీ సీజన్లో ఏర్పడిన ఇబ్బందుల దృష్ట్యా జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు ప్రత్యేక చర్యలకు ఆదేశించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి పర్యవేక్షణలో మార్కెట్ లావాదేవీల క్రమబద్ధీకరణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నాం.

? నాణ్యత ప్రమాణాల నిర్ధారణ, ధరల విషయంలో ఎలాంటి చర్యలున్నాయి?..

✓ కొనుగోళ్ల ప్రక్రియను సకాలంలో జరిపేందుకు మధ్యాహ్నం 3 నుంచి మరునాడు ఉదయం 11 వరకు వ్యవసాయ ఉత్పత్తులను యార్డులోకి అనుమతిస్తారు.. తర్వాత ఉండవు. రైతు తెచ్చిన సరకు, నాణ్యతను ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేసి, పరిశీలన, తూకం, ప్రక్రియ ముగింపు వివరాల నమోదుకు ఏర్పాట్లు చేశాము. ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలతో వేమెంట్ ఇంటిగ్రేషన్ ప్రక్రియను ప్రయోగాత్మకంగా నిర్వహించాము.

? సన్న ధాన్యానికి ప్రైవేటు క్రయ, విక్రయాల్లో బోనస్ చెల్లింపు ఉంటుందా?..

✓ ఇప్పటి వరకు ఈ విషయమై మార్కెటింగ్ శాఖ నుంచి ఎలాంటి ప్రత్యేక సూచనలు, ఆదేశాలు అందలేదు. ప్రభుత్వ ఆదేశాలు, మార్గదర్శకాలను అనుసరించి చర్యలు తీసుకుంటాము.

? కొత్త మద్దతు ధరలు అమలయ్యేలా ఏం చర్యలు తీసుకుంటారు?..

✓ ప్రభుత్వ, ప్రైవేటు కొనుగోళ్లకు మధ్య మద్దతు ధర విషయంలో డిమాండ్, సరఫరా అంశం కీలకమవుతుంది. కత్తెర సీజన్ ధాన్యానికి నాణ్యతను అనుసరించి మంచి ధరలు లభించాయి. రైతులు తమ దగ్గర్లోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర పొందడానికి అన్ని అవకాశాలుంటాయి. ఈ విషయమై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాము.

? మార్కెట్లో రేషన్ అక్రమ బియ్యం వ్యాపారాన్ని అరికట్టేందుకు ఏం చర్యలు తీసుకున్నారు?.. సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తయిందా?..

✓ యార్డులో వ్యాపారస్తుల నివాసాలున్నాయి. అక్రమ వ్యాపారానికి తావు లేకుండా వారితో మాట్లాడాము. ఆరోపణలున్న వారిని ఖాళీ చేయించాము. ఉన్నత సాంకేతికతతో కూడిన సీసీ నిఘా నేత్రాల ఏర్పాటు ప్రతిపాదన కలెక్టర్ పరిశీలనలో ఉంది.

? మార్కెట్ కార్మిక, వ్యాపార వర్గాల సమస్యలు, డిమాండ్ల విషయంలో ఏం చర్యలు తీసుకున్నారు? దయాబిక్షం తదితర వసూళ్ల నియంత్రణ సంగతేంటి?..

✓ హమాలీ, దడువాయి, స్వీపర్ల కూలీ రేట్లను పునఃసమీక్షించాము. కొత్త ధరలు అమల్లోకి వచ్చాయి. కూలీ రేట్ల పెంపు సమయంలో ఈ అంశాన్ని చర్చించాము. రైతుల నుంచి ఉత్పత్తులను తీసుకోకుండా ఉండేందుకు అంగీకరించారు. అడ్తీ వ్యాపారులు, ఖరీదుదారుల మధ్య చెల్లింపుల అంశంపైన దృష్టిసారించాము. అన్ని వర్గాలు సహకరించి మార్కెట్ ప్రతిష్ఠను కాపాడేందుకు సహకరించాలని విజ్ఞప్తి.

ఉపాధి కోసం వెళ్లి.. తూటాకు బలై!
వివరాలు 14లో..

నెరవేరనున్న స్వప్నం.. ఫలించనున్న పోరాటం!

జనగామ, న్యూస్‌టుడే: చేతికందిన అవకాశం సాంకేతిక కారణాలతో చేజారింది. ఉపాధ్యాయులుగా ప్రభుత్వ కొలువులో చేరాల్సిన వేలాది మంది నిరుద్యోగులుగా మిగిలిపోయారు. జీవితంలో ప్రభుత్వ కొలువును సాధించామనే ఆనందం ఆవిరైంది. ఉమ్మడి రాష్ట్రంలో దూరమైన అవకాశం ప్రత్యేక రాష్ట్రంలో అందుబాటులోకి రానుంది. 2008 డీఎస్సీలో కృతార్థులై, కొలువులు పొందలేకపోయిన వారి సమస్యను అధికారంలోకి వస్తే పరిష్కరిస్తామన్న కాంగ్రెస్ ఇచ్చిన హామీ నెరవేర్చబోతోంది. ఒప్పంద ప్రాతిపదికన ఉపాధ్యాయ ఖాళీల్లో వారిని నియమించేందుకు చర్యలను ప్రారంభించింది.

ఎన్నో పరిణామాలు.. మరెన్నో కష్టాలు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 150 మంది అభ్యర్థులు ప్రభుత్వ తాజా నిర్ణయం కారణంగా లబ్ధి పొందనున్నారు. తృటిలో కొలువులు కోల్పోయిన వారు, తమకు న్యాయం చేయాలని అనేక రూపాల్లో పోరాటాలు చేశారు. న్యాయ పోరాటం చేసి సానుకూల ఉత్తర్వులను సాధించుకున్నారు. వారిలో అనేక మంది నాడు అవివాహితులు, కాల క్రమంలో పెళ్లిళ్లై, తల్లిదండ్రులయ్యారు. ప్రైవేటు ఉద్యోగాలు, వివిధ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో జనగామ జిల్లాకు చెందిన సుమారు 35 మందికి లబ్ధి కలగబోతోంది. తాము కన్న కలలు నిజం కాబోతున్నాయని, తమ పోరాటం ఫలించబోతోందని ఆనందంతో ఉన్నారు. వారిలో కొందరిని 'న్యూస్‌టుడే' పలకరించింది.

ప్రైవేటు అధ్యాపకురాలిగా పనిచేస్తున్నా..

- రేవతి



మాది స్టేషన్‌ఘన్‌పూర్ మండలం చిన్న పెండ్యాల. ఎంఎస్సీ బీఈడీ చేసి, 2008 డీఎస్సీలో కొలువుకు ఎంపికయ్యాను. 30 శాతం పోస్టులు డీఎడ్ పూర్తి చేసిన వారికి కేటాయించడంతో చివరి నిమిషంలో ఉద్యోగానికి దూరమయ్యాను. ప్రస్తుతం వివాహం, పిల్లలున్నారు.. వరంగల్‌లో ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో గణిత అధ్యాపకురాలిగా పనిచేస్తున్నా. తాజా నిర్ణయం ఎంతో ఊరటనిస్తోంది.

సువర్ణావకాశంగా భావిస్తున్నా..

- ఆర్.భాగ్యలక్ష్మి



మా సొంత ఊరు స్టేషన్‌ఘన్‌పూర్ మండలం కొత్తపల్లి. మెట్టిన ఊరు రఘునాథపల్లి మండలం కుర్చపల్లి. ఎంఎస్సీ గణితం, బీఎడ్. డీఎస్సీలో విజయం సాధించినా, ఉద్యోగం దక్కలేదు. ప్రస్తుతం కస్తూర్బా స్కూల్‌లో పనిచేస్తున్నా. అప్పుడు డీఎస్సీలో న్యాయం పొందలేకపోయిన వారికి ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయం సువర్ణావకాశంగా భావిస్తున్నాను.

ప్రభుత్వ ప్రకటన అభినందనీయం..

- రవీందర్‌రెడ్డి



మాది తరిగొప్పుల గ్రామం. అప్పటి డీఎస్సీలో ఉద్యోగ అర్హత సాధించినా, అనివార్య కారణాల వల్ల రాలేదు. దీంతో ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చాలీచాలని వేతనంతో పనిచేస్తున్నా. అప్పటి నుంచీ న్యాయ పోరాటం చేస్తూనే ఉన్నాం. ఇటీవలి ప్రభుత్వ ప్రకటన అభినందనీయం.

- శ్రీకళ్యాణిది సొంతూరు రఘునాథపల్లి మండలం ఖిలాషాపురం. వివాహానంతరం ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు విద్యాలయంలో పనిచేస్తున్నారు. తాజా ప్రకటనతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- ప్రశాంత్‌ది పర్వతగిరి మండలం కల్లెడ. ప్రస్తుతం జనగామలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. గతంలో ప్రత్యేక కారణాలతో చివరి నిమిషంలో కొలువు దక్కలేదు. వివాహం, పిల్లలు, కుటుంబ బాధ్యతలతో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వం కల్పించిన అవకాశం సద్వినియోగం చేసుకుంటామని వివరిస్తున్నారు.

కల నెరవేరబోతోంది..

- వల్లెపు మైసయ్య



మాది బచ్చన్నపేట మండలం మన్‌సాన్‌పల్లి. డీఎస్సీ 2008లో ఉద్యోగం రాబోతుందనే ఆనందం ఉండేది. కానీ అంతలోనే అనుకోని అవాంతరం. తర్వాత కొలువుల కోసం ఆరు మాసాల పోరాటం.. టీచర్ జాబ్ వస్తుందని ముంగిట్లోకి వచ్చిన పెళ్లి సంబంధం, ఉద్యోగం రాకపోవడంతో దూరమైంది. విధి వైపరీత్యంతో సర్టిఫికెట్లు అటకెక్కి, నాగలి భుజానికి చేరింది. ఇటీవలి నిర్ణయంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి జీవితకాలం రుణపడి ఉంటాము. నా కళ నెరవేరబోతోంది.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించండి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా, అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

జనగామఅర్బన్, న్యూస్‌టుడే: భూముల లేఅవుట్ క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్)కు సంబంధించిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా అధికారులను ఆదేశించారు. జనగామ కలెక్టరేట్‌లో శనివారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి రెవెన్యూ, నీటి పారుదల, పురపాలిక అధికారులతో సమావేశం నిర్వహించారు. పురపాలిక పరిధిలోని భూముల క్రమబద్ధీకరణ సర్వే ప్రక్రియ వేగవంతానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో వివరాలను సక్రమంగా నమోదు చేయాలన్నారు. దరఖాస్తులను పరిష్కరించే ముందు ప్రైవేట్ స్థలమా? ప్రభుత్వ స్థలమా అనేది నిర్ధారించుకోవాలన్నారు. క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లేముందు దరఖాస్తుదారులకు సమాచారం ఇస్తే అందుబాటులో ఉంటారన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో, ఆర్డీవో కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పురపాలిక పరిధిలో 12,552 దరఖాస్తులకుగాను 144 అర్జీల సర్వే పూర్తయిందని, డిసెంబరులోగా ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఏ సర్వే నెంబర్‌కు ఎక్కువ దరఖాస్తులు ఉంటాయో అక్కడి పురపాలిక, నీటిపారుదల, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. సమావేశంలో జనగామ ఆర్డీవో కొమురయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నీటిపారుదలశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు కేంద్రాల ఏర్పాటు

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: వరంగల్, నల్గొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ రిజ్వాన్‌బాషా శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఇందుకోసం కలెక్టరేట్‌లోని విద్యాశాఖాధికారి, ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయాల్లో, మీడియా సెంటర్‌లో ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటితో పాటు జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో కార్యాలయాలు, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల్లోనూ ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు.

కేంద్ర మాజీ మంత్రికి నివాళి

జనగామఅర్బన్ : కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతిని కలెక్టరేట్‌లో అధికారికంగా నిర్వహించారు. కలెక్టర్ రిజ్వాన్‌బాషా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి వెంకట్‌రెడ్డి, డీఏవో రామారావునాయక్, బీసీ సంక్షేమాధికారి రవీందర్, జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారిణి చౌడేశ్వరి, డీఎంహెచ్‌వో రవీందర్ గౌడ్, ఇతర జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామక పత్రాల అందజేత



జనగామటౌన్, న్యూస్‌టుడే: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు శనివారం జిల్లా వైద్యాధికారి రవీందర్‌గౌడ్ తన ఛాంబర్‌లో నియామక పత్రాలను అందజేశారు. స్టాఫ్‌నర్సులు, ఏఎన్ఎంలు, ఫార్మాసిస్ట్, ఎంఎల్‌హెచ్‌పీ, ఆర్‌బీఎస్‌కే తదితర పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు కలెక్టర్ ఆమోదంతో నియామక పత్రాలను అందజేసినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. అభ్యర్థులు అంకితభావంతో సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కార్యాలయ సూపరింటెండెంట్ హేమానాయక్, సీనియర్ అసిస్టెంట్లు విజయ్, బాలనాగమ్మ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని ఎత్తుకుంటున్న మహిళ



వర్షపునీటిలో కొట్టుకుపోయిన ధాన్యం



ఆర్టీసీచౌరస్తాలో వాహనదారుల అవస్థలు

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

జనగామ, జనగామటౌన్, న్యూస్‌టుడే: జనగామ పట్టణంతో పాటు జిల్లాలోని మూడు మండలాల్లో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. హైదరాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారి వెంట మురుగు కాల్వలు ఉప్పొంగాయి. రహదారిపై వరదనీరు నిలిచిపోవడంతో దుకాణదారులు, వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. జనగామలోని వ్యవసాయ మార్కెట్ కొత్త యార్డులో ఆరబోసిన మక్కలు కొట్టుకుపోయాయి. వ్యాపారులు ఖరీదు చేసిన ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. పల్లపు ప్రాంతాల్లో ధాన్యం కొట్టుకుపోయింది. సుమారు 7 వేల బస్తాల ధాన్యం అమ్మకానికి రావడంతో రెండు కవర్ షెడ్లు నిండిపోయాయి. షెడ్ల వెలుపల పోసిన ధాన్యం కొంత మేర తడిసింది. అప్పటికే ధరలు నిర్ణయించడంతో రైతులకు నష్టం జరగలేదు. ధాన్యంపై టార్పాలిన్లను కప్పడంతో క్రయ, విక్రయాలు జరిగే యార్డులో నష్టం తప్పింది. ఆర్టీసీ చౌరస్తాలో ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కొందరు గొడుగులు వేసుకొని వాహనాలపై ప్రయాణించారు. జిల్లాలోని వివిధ మండలాల్లో కురిసిన వర్షపాతం వివరాలివి (మి.మీ.ల్లో).. జనగామ- 53.3, బచ్చన్నపేట-35.8, దేవరుప్పుల-23, కొడకండ్ల-13.8, నర్మెట్ట-0.5


ఈ విద్యాలయం.. సైనికుల కర్మాగారం!

ఖానాపురం(నర్సంపేట), న్యూస్‌టుడే: వరంగల్ జిల్లా ఖానాపురం మండలం అశోక్‌నగర్‌లోని సైనిక్ స్కూల్‌లోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ అకాడమి దేశరక్షణకు మెరికల్లాంటి సైనికులను అందిస్తోంది. ఇక్కడ చదివిన పలువురు విద్యార్థులు సరిహద్దుల్లో సైనికులుగా పనిచేస్తూ దేశ రక్షణలో పాలు పంచుకుంటున్నారు. ఈ విద్యాలయంలో చేరిన నిరుపేద గిరిజన విద్యార్థులకు విద్య, వసతితో పాటు వ్యాయామం, దేహదారుఢ్యం తదితర అంశాల్లో పటిష్ఠ తర్ఫీదు ఇస్తున్నారు. పలు అంశాలను ఆకళింపు చేసుకుంటున్న విద్యార్థులు.. ప్రభుత్వం నిర్వహించే శారీరక, రాత పరీక్షలను సులువుగా అధిగమించి భారత సైన్యం, అగ్నివీర్, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, నేవీ, పోలీసు తదితర విభాగాల్లో ఎంపికై సేవలందిస్తున్నారు. 1984లో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పాలనలో ఏర్పాటు చేసిన గిరిజన ఆశ్రమ పాఠశాల అంచెలంచెలుగా ఉన్నతీకరణ చెంది సైనిక్‌స్కూల్‌గా మారింది. 2022, 2023 విద్యా సంవత్సరాల్లో త్రివిధ రక్షణ దళాలు, భద్రత, తదితర విభాగాల్లో 22 మంది సేవలందిస్తున్నారు. అగ్నివీర్‌కు నలుగురు, జీడీఎస్ పోస్టల్‌కు ముగ్గురు, ఫైర్‌మెన్ ఏవోసీకి ఒకరు, సీఆర్పీఎఫ్‌కు ఒకరు, బీఎస్ఎఫ్‌కు ఒకరు, భారత సైన్యానికి ఐదుగురు, నావికా దళానికి ఇద్దరు, టీఎస్ పోలీస్ కానిస్టేబుళ్లుగా ఐదుగురు ఎంపికయ్యారు.



సైనిక్ పాఠశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

డిగ్రీ ద్వితీయ ఏడాదిలోనే ఎంపికయ్యా..



సైనిక్‌స్కూల్‌లో ఇంటర్‌లో చేరాను. డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా ఆర్మీకి ఎంపికయ్యాను. ఇక్కడి అధ్యాపకులు ఇచ్చిన తర్ఫీదు వల్లే ఇది సాధ్యమైంది. ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్‌లో పని చేస్తున్నా. దేశ రక్షకుడిగా పని చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలకు చేరవచ్చు. **-రాము**

అధ్యాపకుల శిక్షణ తోడ్పడింది



ఇంటర్‌లో పాఠశాలలో చేరాను. భారత సైన్యానికి ఎంపికయ్యేందుకు. అధ్యాపకులు, ఇన్‌స్ట్రక్టర్లు అందించిన శిక్షణ తోడ్పడింది. తక్కువ సమయంలో ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది. **-జవిందర్**

గురుకులంలో చదవడం అదృష్టం



డిఫెన్స్‌లో ఫైర్‌మెన్ ఏవోసీకి ఎంపికయ్యాను. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతుండగా ఉద్యోగం వచ్చింది. గురుకులంలో చదవడం నా అదృష్టం. క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఏదైనా సాధించొచ్చు. తల్లిదండ్రుల రుణం తీర్చుకుంటా. **-సింహాద్రి**

ఉన్నతాధికారిగా దేశానికి సేవలందిస్తా



డిగ్రీ చదువుతుండగానే ఉద్యోగం వచ్చింది. నేవీలో శిక్షణ పూర్తయింది. పాఠశాల ఉపాధ్యాయుల సూచనలు పాటించి పట్టుదలతో చదివి ఈవెంట్లు చేశాను. ఉన్నతాధికారిగా దేశానికి సేవలందిస్తా. **-భరత్**

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ

- సురేందర్, ప్రిన్సిపల్, సైనిక్‌స్కూల్, అశోక్‌నగర్

క్రమశిక్షణతో చదివితే ఉద్యోగాలు సాధించడం సులువని సైనిక్‌స్కూల్ విద్యార్థులు నిరూపించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతాం. అందరి కృషితోనే ఇది సాధ్యమైంది.

ఉపాధి కోసం వెళ్లి.. తూటాకు బలై!

● ఉగాండాలో జనగామ సివిల్ ఇంజినీర్ హత్య



తిరుమలేష్ (పాత చిత్రం)



స్వగృహంలో రోదిస్తున్న తల్లి కిష్టమ్మ, బంధువులు

జనగామ టౌన్, న్యూస్‌టుడే : ఉన్నత విద్య అభ్యసించారు.. ఉపాధి మార్గం వెతుక్కుంటూ విదేశానికి వెళ్లారు.. జీవితం అంతా సాఫీగా సాగుతుందనుకున్న సమయంలో తుపాకీ తూటా రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. ఈ ఘటన జనగామ పట్టణంలో విషాదం నింపింది. జనగామ పట్టణం తొమ్మిదో వార్డు గిర్నిగడ్డకు చెందిన ఇటికాల తిరుమలేశ్(42) సివిల్ ఇంజినీర్ పూర్తి చేశారు. కొంతకాలం కరీంనగర్‌లో ఉద్యోగం చేసిన అనంతరం ఉగాండా దేశంలోని రాయల్‌టెక్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో అవకాశం రావడంతో పదేళ్ల క్రితం అక్కడికి వెళ్లారు.. ప్రాజెక్టు మేనేజర్ హోదాలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఉగాండాలోని నమ్మశాల ప్రాంతంలోని కంపెనీలో శుక్రవారం తిరుమలేష్ విధుల్లో ఉండగా శుక్రవారం ఉదయం 9.30 గంటల సమయంలో(భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12.30 గంటలు) అదే కంపెనీకి చెందిన సెక్యూరిటీ గార్డు తాగిన మైకంలో ఒక్కసారిగా తుపాకీతో గాల్లోకి రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. భారీ శబ్దం విని బయటకు వచ్చిన తిరుమలేష్‌పైనా విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ తర్వాత సెక్యూరిటీ గార్డు కూడా తనను తాను కాల్చుకుని చనిపోయాడు. ఈ ఘటనతో భయకంపితులైన కంపెనీలోని ఇతర ఉద్యోగులు బయటకు రాలేదు. తిరుమలేష్ మృతిచెందిన విషయాన్ని కంపెనీ ప్రతినిధులు జనగామలో ఉంటున్న తల్లి కిష్టమ్మ, సోదరుడు చిన్నాకు సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులంతా ఒక్కసారిగా శోకసంద్రంలో మునిగిపోయారు. తిరుమలేష్‌కు భార్య సునీత, కుమార్తె అఖిల, కుమారుడు వరుణ్ ఉన్నారు. కుమార్తె అఖిల నిజామాబాద్‌లోని అమ్మమ్మ ఇంటి వద్ద 8వ తరగతి చదువుతోంది. కుమారుడు వరుణ్ ఉగాండాలోనే తల్లిదండ్రులతో ఉంటూ పదోతరగతి చదువుతున్నాడు. తిరుమలేష్ తండ్రి కిష్టయ్య కరోనాతో నాలుగేళ్ల క్రితం మృతి చెందారు. మృతుడి తల్లి కిష్టమ్మతో పాటు మరో సోదరుడు చిన్నా, సోదరి హేమలత జనగామలోనే ఉంటున్నారు. తిరుమలేష్ మృతి వార్త తెలియగానే ఆయన ఇంటికి బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించి కన్నీళ్లు పెట్టుకున్నారు.

అంతా సివిల్ ఇంజినీర్లే

మృతిచెందిన తిరుమలేష్ సివిల్ ఇంజినీర్ కాగా, అతని సోదరుడు చిన్నా కూడా సివిల్ ఇంజినీర్‌గా సిద్దిపేటలో పనిచేస్తున్నారు. తండ్రి కిష్టయ్య సివిల్ ఇంజినీరింగ్ విభాగంలోనే పనిచేసేవారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించి మంచి స్థానాలకు చేర్చిన తండ్రి కిష్టయ్య కరోనాతో దూరంగా కాగా, ఇప్పుడు ఇంటి పెద్ద కొడుకు తిరుమలేష్ కూడా చనిపోవడంతో తల్లి కిష్టమ్మతో పాటు కుటుంబమంతా శోకసంద్రంలో మునిగిపోయింది. తిరుమలేష్ మృతదేహాన్ని మంగళవారం వరకు జనగామకు తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు సోదరుడు చిన్నా తెలిపాడు. ఉగాండాలోని ఎంబసీ అధికారులకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ద్వారా సమాచారం చేరవేసి మృతదేహం రప్పించేందుకు స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవ తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

అవివాహితులకు సువర్ణావకాశం

● నేడు ఎస్టీ (బంజార/ లంబాడ) కులాల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి డాట్ నెట్ ఉచిత నమోదు కార్యక్రమం



బాలసముద్రం, న్యూస్‌టుడే : తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లిపందిరి' వేదికగా సువర్ణ అవకాశం కల్పిస్తోంది. ఎస్టీ (బంజారా/లంబాడ) కులాలకు చెందిన అవివాహిత వధూవరుల కోసం ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. బాలసముద్రంలోని 'ఈనాడు' కార్యాలయంలో ఆదివారం (అక్టోబర్ 6వ తేదీ) ఈ కార్యక్రమం చేపట్టింది. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులు లేదా సంబంధిత కుటుంబీకులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5:30 గంటలలోపు ఈ కార్యక్రమంలో పాల్గొని ఉచితంగా వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఫోన్ ద్వారా నమోదు చేసుకునే వారు తమ బయోడేటా, ఫొటోలను 83744 45190, 80080 02165 నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపవచ్చు. మరిన్ని వివరాలకు ఇవే ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

అండర్-19 క్రికెట్ పోటీల విజేత కరీంనగర్

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఉత్కంఠ భరితంగా సాగిన పోటీలో మహబూబ్‌నగర్ జట్టుపై కరీంనగర్ 2 వికెట్లతో తేడాతో విజయం సాధించింది. హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఓరుగల్లు జిల్లా కేంద్రంగా నిర్వహించిన అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ముగిశాయి. శనివారం వరంగల్ నగర శివారులో ఉన్న మొగిలిచర్ల మైదానంలో మహబూబ్‌నగర్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల జట్ల మధ్య తుదిపోరు జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మహబూబ్‌నగర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. జట్టులో షాదాబ్ 89, అబ్దుల్ 48 పరుగులతో రాణించారు. కరీంనగర్ బౌలర్లు విఘ్నేష్, అర్షద్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో కరీంనగర్ జట్టు 49.5 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 241 పరుగులు చేసి విజేతగా నిలిచింది. విఘ్నేష్ 53 పరుగులు, కమ్రాన్ 50 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చారు. అనంతరం జరిగిన ముగింపు వేడుకలో అతిథులు విజేత, రన్నరప్ జట్లకు ట్రోఫీలు అందించారు. ఈ సందర్భంగా వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. అండర్-19 టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రికెటర్లను హెచ్‌సీఏ జట్టుకు ఎంపిక చేయాలని కోరారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు పెద్ది ప్రవీణ్‌గౌడ్, బస్వరాజు శ్రీమాన్, ఉదయభానురావు, వెంకటేశ్వర్లు, రఘురాం, ఉపేందర్, రాము, కుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.



కరీంనగర్ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న అతిథులు

'అలుగు' అక్రమ రవాణా కేసులో స్మగ్లర్ల అరెస్టు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: భూపాలపల్లి అటవీ రేంజి పరిధిలోని మేడిపెల్లి టోల్‌గేట్ ప్రాంతంలో అలుగు (పొంగలిన్) రవాణాకు పాల్పడిన కేసులో శనివారం ఐదుగురు స్మగ్లర్లను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చినట్లు భూపాలపల్లి అటవీ అధికారులు తెలిపారు. ఇదే కేసులో చెన్నైకి చెందిన వైల్డ్ లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో, ఇంటెలిజెన్స్ అధికారులు చాకచక్యంగా కొనుగోలుదారుల రూపంలో తాటి రాజ్‌కుమార్, ఎండీ. నజీర్, ఎండీ.అమ్జద్‌ఖాన్‌లను అదుపులోకి తీసుకుని హనుమకొండకు తరలించిన విషయం తెలిసిందే. వీరిని విచారించగా మరో ఐదుగురి ప్రమేయం ఉందని నిందితులు చెప్పినట్లు స్థానిక రేంజి అధికారి నరేష్ అరెస్టు వివరాలను వెల్లడించారు. గట్టు సమ్మయ్య, తాళ్లపల్లి శంకర్, ఊరుగొండ దేవన్న, పెద్ది లక్ష్మయ్య, నరివెద్ది వెంకటనారాయణ కోసం గాలించగా గట్టు సమ్మయ్య, నరివెద్ది వెంకటనారాయణను అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వారు పరారీలో ఉన్నారని, మొత్తం 8 మందిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అరెస్టు అయిన వారిలో కాటారం మండలం కొత్తపల్లి, ములుగుపల్లి, ఇబ్రహీంపల్లికి చెందిన తాటి రాజ్‌కుమార్, గట్టు సమ్మయ్య, ఎండీ.అమ్జద్‌ఖాన్, మహాముత్తారం మండలం యామన్‌పల్లికి చెందిన ఎండీ. నజీర్, భూపాలపల్లికి చెందిన నరివెద్ది వెంకటనారాయణ ఉన్నారు. వీరి నుంచి రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు రేంజి అధికారి నరేష్ తెలిపారు. కాటారం అటవీ రేంజి అధికారి హసీప్ అలీ, సెక్షన్ అధికారి సంతోష్, బీట్ ఆఫీసర్లు ప్రశాంత్, భాస్కర్ పాల్గొన్నారు.



అరెస్టు చూపుతున్న భూపాలపల్లి అటవీ అధికారులు

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

కుస్తీ పోటీల్లో ఓరుగల్లుకు కాంస్యం



తృతీయ స్థానంలో నిలిచిన జట్టుతో అతిథులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్ఐ) కుస్తీ(రెజ్లింగ్) పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు తృతీయస్థానంలో నిలిచింది. నారాయణపేట జిల్లా ధన్వాడలో శనివారం జరిగిన కుస్తీ పోటీల్లో అండర్-19 బాలికల జట్టు పతకాలతో రాణించింది. బి.అంజలి 55 కిలోల విభాగంలో స్వర్ణం కైవసం చేసుకుంది. 69 కిలోల విభాగంలో సౌమ్య, 76 కిలోల విభాగంలో ఎన్.అంజలి రజత పతకాలు, 59 కిలోల విభాగంలో కావేరి, 72 కిలోల మైత్రేయి కాంస్య పతకాలు సాధించారు. స్వర్ణం నెగ్గిన బి.అంజలి దిల్లీలో జరిగే ఎస్‌జీఎఫ్ఐ(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) జాతీయస్థాయి కుస్తీ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు హనుమకొండ జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి, హనుమకొండ కళాశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. పతకాలు సాధించిన రెజ్లర్లను హనుమకొండ జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గోపాల్, తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ సంఘం కార్యదర్శి కరీం అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


సాయిప్రియ


చిల్పూర్, న్యూస్‌టుడే: మండలంలోని పల్లగుట్ట ఉన్నత పాఠశాల విద్యార్థి కోల సాయిప్రియ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేతిడి నరసింహారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 3న జనగామ జిల్లా ధర్మకంచ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి జూనియర్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వివరించారు. అక్టోబర్ 7 నుంచి 8 వరకు హనుమకొండ జిల్లా కేంద్రంలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించనున్న పదో తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్ పోటీలలో పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఉపాధ్యాయ బృందం అభినందించారు.

'దిష్టి'పై దృష్టి



పదుల సంఖ్యలో దిష్టిబొమ్మలున్న ద్విచక్రవాహనాన్ని ప్రజలు ఆసక్తిగా వీక్షించారు. ఓ చిరువ్యాపారి వాటిని విక్రయించడానికి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. మండలంలోని శివునిపల్లిలో దిష్టి బొమ్మలను అమ్ముతుండగా 'న్యూస్‌టుడే' తన కెమెరాలో దృశ్యాన్ని బంధించింది. – న్యూస్‌టుడే, స్టేషన్‌ఘన్‌పూర్

వంతెనపై దీపాలు వెలిగేదెప్పుడో.?



స్టేషన్‌ఘన్‌పూర్ పట్టణం నుంచి శివునిపల్లి వరకు నిర్మించిన ఫ్లై ఓవర్ వంతెనపై కొద్ది నెలలుగా విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. రాత్రి సమయంలో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం పాలకుర్తి, జఫర్‌గఢ్ తదితర గ్రామాలకు ప్రజలు ప్రయాణం కొనసాగిస్తుంటారు. సంబంధిత శాఖ అధికారులు సమస్యపై దృష్టిసారించి విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, స్టేషన్‌ఘన్‌పూర్

మేమున్నాం.. మీకు తోడుగా జనగామ: 80085 74872 జనగామ అర్బన్: 80749 20132 పాలకుర్తి: 98663 66702 స్టేషన్‌ఘన్‌పూర్: 90521 83243 జఫర్‌గఢ్: 98662 50618 (10 AM TO 1 PM)

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: జఫర్‌గఢ్ శివారు వడ్డెగూడెం ఎస్సీ కాలనీలో వీధి దీపాలు వెలుగక రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. **- వడ్డెగూడెం వాసులు.**

సమాధానం: వీధి దీపాలు వెలిగించేందుకు చర్యలు తీసుకుంటాం. **- రాజేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శి, జఫర్‌గఢ్**

మురుగుకాల్వలు శుభ్రం

స్పందనకు వందనం

పాలకుర్తి, న్యూస్‌టుడే: తొర్రూరులోని మురుగుకాల్వల్లో చెత్తా చెదారం పేరుకుపోయింది. ఈ సమస్యను ఎంపీడీవో రాములు దృష్టికి తీసుకెళ్లగా.. పంచాయతీ సిబ్బందితో మురుగుకాల్వలను శుభ్రం చేయించారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయండి


నర్మెట్టలో మాట్లాడుతున్న ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కిషోర్‌మాదిగ

నర్మెట్ట(తరిగొప్పుల), న్యూస్‌టుడే: ఉద్యోగాల భర్తీలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా డీఎస్సీ ఫలితాలను విడుదల చేయడం మాదిగ ఉప కులాలకు అన్యాయం చేయడమేనని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కిషోర్ మాదిగ అన్నారు. నర్మెట్టలోని వేడుకల మందిరంలో శనివారం ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి మాదిగలను ఉద్యోగావకాశాలు దక్కకుండా మాలలకు దోచిపెడుతున్నారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ ప్రకారమే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొంపెల్లి అంబేడ్కర్, చుంచు రాజు మాదిగ, రవి, భాస్కర్, చరణ్ కుమార్, వంశీ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ద్రోహం చేశారని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కిశోర్ మాదిగ అన్నారు. బచ్చన్నపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని ప్రకటించిన సీఎం.. వర్గీకరణ అమలు చేయకుండానే డీఎస్సీ ఫలితాలను విడుదల చేయడం దారుణమన్నారు. ఇందుకు నిరసనగా ఈనెల 9న జిల్లాలో నల్లజెండాలతో ప్రదర్శనలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెస్పీ మండల ఇన్‌ఛార్జి పాకాల కుమారస్వామి, ఎంఎస్పీ జిల్లా నాయకులు రవి, భాస్కర్, అల్వాల నర్సింగరావు, అంజయ్య, అనిల్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శన విజయవంతం చేయాలి


ప్రసంగిస్తున్న రవీందర్

స్టేషన్‌ఘన్‌పూర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా వర్గీకరణను అమలు చేస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ.. ఈ నెల 9న జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు చేపట్టిన నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి సందెన రవీందర్ అన్నారు. డివిజన్ కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణకు సంబంధించి రాష్ట్రాలకు సుప్రీం కోర్టు సూచించిన జడ్జిమెంటను తక్షణమే అమలు చేయాలన్నారు. కాలయాపన చేయడం సరికాదని తెలిపారు. కార్యక్రమంలో మాదిగల పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి గాదె శ్రీధర్, నాయకులు మంద శ్రీనివాస్, చాడ ఏలియా, గుర్రం అశోక్, ప్రశాంత్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యావేత్త మృతికి సంతాపం

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామకు చెందిన విద్యావేత్త, విశ్రాంత ఉపాధ్యాయుడు మహమ్మద్ గౌస్ మొహినొద్దీన్ (72) శుక్రవారం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో మృతి చెందారు. బాలాజీనగర్‌లోని ఆయన స్వగృహంలో శనివారం ఆయన మృతదేహాన్ని రెడ్‌క్రాస్, లయన్స్ క్లబ్ సభ్యులు, విద్యావేత్తలు సందర్శించి నివాళి అర్పించారు. పలు సంఘాల ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, కన్నా పరశురాములు, చంద్రశేఖర్, జాన్‌బన్నీ, లవకుమార్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద రావు, భిక్షపతి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఓటరు నమోదు కేంద్రం ఏర్పాటు..

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: డివిజన్ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంతో పాటు, ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల్లో వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఫారం-19 నింపి నవంబర్ 6 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండల పరిధిలో అర్హత కలిగిన ఉపాధ్యాయులు నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిని ఢీకొన్న అదనపు కలెక్టర్ వాహనం

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలో శనివారం సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ వాహనం ఢీకొట్టిన ఘటనలో ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. స్థానికులు, 108 సిబ్బంది కథనం ప్రకారం.. మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన గంగారపు సరోజన జనగామలోని బంధువుల ఇంటికి వెళ్లి వస్తూ, స్థానిక బస్టాండ్ వద్ద వాహనం దిగి బస్టాండ్‌కు వెళ్తుండగా సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ వీ ఎస్. లత తన వాహనంలో జనగామ వైపు నుంచి హనుమకొండకు వెళ్తుండగా సరోజనను ఢీకొట్టింది. ప్రమాదంలో సరోజన తలకు, చేతికి బలమైన గాయాలయ్యాయి. వెంటనే అదనపు కలెక్టర్‌తో పాటు స్థానికులు 108 లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అదనపు కలెక్టర్ సైతం బాధితురాలితో ఆసుపత్రి వరకు వెళ్లినట్లుగా సమాచారం.

జూద కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ దాడి

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ పోలీసు డివిజన్ చిల్పూర్ ఠాణా పరిధిలో జూద కేంద్రంపై శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఏసీపీ ఎ.మధుసూదన్ కథనం మేరకు... చిల్పూర్ మండలం చుట్టు పక్కల నుంచి కొంతమంది వ్యక్తులు వచ్చి చిన్నపెండ్యాల గ్రామశివారుల్లో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశారు. ఐదుగురు జూదం ఆడుతూ పట్టుబడ్డారు. వారి నుంచి రూ.2,440 నగదు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు విచారణ కోసం చిల్పూర్ పోలీసులకు అప్పగించామని ఏసీపీ తెలిపారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు


స్టేషన్‌ఘన్‌పూర్‌లో...


జనగామ అంబేడ్కర్‌నగర్‌లో..


కడవెండిలో..


బచ్చన్నపేట మండలం మన్‌సాన్‌పల్లిలో..


తాటికొండలో..


పాలకుర్తి సోమేశ్వరాలయంలో..


ధర్మకంచలో..

పాలకుర్తి, న్యూస్‌టుడే: పాలకుర్తిలోని సోమేశ్వరాలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం అమ్మవారిని అన్నపూర్ణగా అలంకరించి పూజలు చేశారు. అర్చకులు పంచామృతా అభిషేకం, కుంకుమార్చన, చండీ హోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

జనగామ టౌన్ : జనగామలోని అంబేడ్కర్‌నగర్ లోని దుర్గాదేవిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు నేవేద్యాలు సమర్పించారు. ధర్మకంచలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

బచ్చన్నపేట : బచ్చన్నపేట, పోచన్నపేట, మన్‌సాన్‌పల్లి, సాల్వాపూర్, కొన్నె, పడమటికేశ్వాపూర్, కేసిరెడ్డిపల్లి గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. దుర్గాదేవిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీల నిర్వాహకులు పాల్గొన్నారు.

దేవరుప్పుల రూరల్: కడవెండిలో దుర్గాదేవికి మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: డివిజన్ కేంద్రంలో శ్రీమాత శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం అమ్మవారిని కూరగాయలు, ఆకుకూరలతో అలరించారు. అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, గన్ను కార్తిక్, గడ్డం విష్ణుశంకర్ వేళ్ల సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని తాటికొండ గ్రామంలోని దుర్గా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారు గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు వరుణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల అనుమతులు సులభతరం


కొత్తపేటలో పరిశ్రమల నిర్మాణ చిత్రపటం పరిశీలిస్తున్న 'కుడా' వీసీ, అధికారులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసే పరిశ్రమల అనుమతులు సులభతరం చేస్తామని 'కుడా' వైస్ ఛైర్మన్ డా.అశ్విని తానాజీ తెలిపారు. శనివారం అధికారులతో కలిసి కొత్తపేట పరిశ్రమల జోన్‌లో తాజాగా వచ్చిన అనుమతుల స్థలాలు పరిశీలించారు. కొత్త బృహత్ ప్రణాళిక(మాస్టర్ ప్లాన్)లో ప్రతిపాదించిన విధంగా పరిశ్రమల జోన్‌లో స్థలాల లభ్యత, భవిష్యత్తులో చేయాల్సిన అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో సీపీఓ అజిత్‌రెడ్డి, ఏపీఓ రవీందర్, జేపీఓ శంకర్ తదితరులున్నారు.

త్వరలో చేప పిల్లల పంపిణీ

జనగామ రూరల్, న్యూస్‌టుడే: ప్రభుత్వం నాణ్యమైన చేప పిల్లలను అందించాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు నీల రాజు అన్నారు. సంఘం జిల్లా కార్యవర్గం, గుత్తేదార్లతో శనివారం నిర్వహించిన సమావేశంలో రాజు మాట్లాడారు. రిజర్వాయర్‌లో 80-100 మి.మి., చెరువులు, కుంటల్లో 35-40 మి.మి.ప్రమాణాలు పాటించాలని చేప పిల్లల సరఫరాదారులను కోరారు. త్వరలో స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్‌లో చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారి రాణాప్రతాప్, సంఘం నాయకులు బి.వెంకటయ్య, వై.రాజు, పి.రాజు, సంపత్, నిమ్మల స్వామి, రాములు, శంకర్, సత్తయ్య, కుమారస్వామి, రాఘవులు పాల్గొన్నారు.

పెరిగిన ధరలను నియంత్రించండి

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: దేశంలో పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని ఇప్పగూడెంలో శనివారం జరిగిన పార్టీ మహాసభలకు ఆయన హాజరై మాట్లాడారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు నిత్యవసర సరకుల ధరలు విచ్చలవిడిగా పెంచడంతో సామాన్య ప్రజలు ఏమీ కొనలేని పరిస్థితి నెలకొందని మండిపడ్డారు. అనంతరంలో గ్రామంలో వార్డు శాఖ కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, రమేష్, కొడెపాక యాకయ్య, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అమరులకు నివాళి


దొడ్డి కొమురయ్య స్తూపం వద్ద నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే: కడవెండి, కామారెడ్డిగూడెం, ధర్మాపురంలోని అమరుల స్తూపాలను శనివారం కేరళ సీపీఎం(యూటీఎఫ్) నాయకులు సందర్శించి నివాళులర్పించారు. దొడ్డి కొమురయ్య, షేక్ బందగీ, జాటోతు టానునాయక్, స్తూపాలను సందర్శించి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన వీరుల చరిత్రలను తెలుసుకున్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగారపు రమేష్, బండారు రమేష్, మాచర్ల సారయ్య, సాదం రమేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే చర్యలు


భూమిపత్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

పాలకుర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. ఆయన శనివారం వల్మిడి శివారులోని ప్రభుత్వ భూమిని అధికారులతో కలిసి సందర్శించారు. సర్వే నెంబర్ 389లో 4.38 ఎకరాల భూమికి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ రాకేష్ ఉన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి


సిబ్బందికి ధ్రువపత్రాలు అందజేస్తున్న జడ్పీ సీఈవో సరిత

జనగామ రూరల్, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సరఫరాలో మెరుగైన సేవలందించాలని జడ్పీ సీఈవో సరిత అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మిషన్‌భగీరథ శాఖ ఆధ్వర్యంలో తాగునీటి సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. చివరి రోజు సింగిల్ ఫేజ్ బోరు మోటార్ల వాడకం, లోపాలను సరి చేసే విధానాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. సీఈవో మాట్లాడుతూ సిబ్బంది సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు. శిక్షణ పొందిన సిబ్బందికి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మిషన్‌భగీరథ ఏఈ ప్రేమలత, ఎంపీడీవో సంపత్‌కుమార్, సిబ్బంది రాధిక తదితరులు పాల్గొన్నారు.


బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట, న్యూస్‌టుడే: నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి స్వరూప అన్నారు. బచ్చన్నపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మంచినీటి సహాయకులకు నిర్వహించిన శిక్షణ సమావేశంలో ఆమె మాట్లాడారు. శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. నీటి ట్యాంకులను శుభ్రంగా ఉంచాలన్నారు. పైప్‌లైన్, గేట్‌వాల్వుల లీకేజీలకు మరమ్మతులపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటమల్లికార్జున్, మిషన్ భగీరథ ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలను విస్మరించిన పాలకవర్గాలు



ఇబ్రహీంపురంలో ర్యాలీ తీస్తున్న నాయకులు

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ పేదల సంక్షేమాన్ని పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర పాలక వర్గాలపై ప్రజలు పోరాటాలు చేయాలని సీపీఎం నాయకులు అన్నారు. మండలంలోని ఇబ్రహీంపురంలో శనివారం పార్టీ గ్రామ సభను నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ చేపట్టారు. సీపీఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హామీలను సమర్థవంతంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. గ్రామ శాఖ ఎన్నికను నిర్వహించి కార్యదర్శిగా సజ్జన మల్లేశ్ ఎన్నికైనట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు గ్యార నర్సింగరావు, శారద, రమ, స్వరూప, ఆంజనేయులు, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ డిజిటల్ సర్వే పరిశీలన


రఘునాథపల్లి మండలం మాదారంలో

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని మాదారంలో నిర్వహిస్తున్న కుటుంబ డిజిటల్ సర్వేను శనివారం జిల్లా పంచాయతీ అధికారి స్వరూప పరిశీలించారు. క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది చేస్తున్న సర్వే తీరుపై ఆరా తీశారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షా జరిపారు. కార్యక్రమంలో డీఎల్పీవో వెంకట్ రెడ్డి, ఎంపీవో వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి కుమార స్వామి, బిల్ కలెక్టర్ రాజేశ్, ఈజీఎస్ క్షేత్ర సహాయకులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షంతో ఇబ్బందులు

బచ్చన్నపేట, న్యూస్‌టుడే: బచ్చన్నపేట, కేసిరెడ్డిపల్లి, పోచన్నపేట, నారాయణపురం, కొడవటూర్ గ్రామాల్లో శనివారం వర్షం కురిసింది. బచ్చన్నపేటలో చెట్లు విరిగి విద్యుత్తు లైన్‌పై పడడంతో మూడు గంటల పాటు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నారాయణపురంలో నర్సింహులుకు చెందిన వ్యవసాయ బావి వద్ద తాటిచెట్టుపై పిడుగు పడింది.

ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవాలి

కొడకండ్ల, న్యూస్‌టుడే: వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హులైన ప్రభుత్వ ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవాలని కొడకండ్ల తహసీల్దార్ చంద్రమోహన్ తెలిపారు. ఈ ఏడాది నవంబర్‌లోగా మూడేళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారు తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో నమోదు చేసుకోవాలన్నారు. కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్ ప్రారంభించారన్నారు.

ముగిసిన కేయూ సెర్చ్ కమిటీ సమావేశం

ఈనాడు, వరంగల్, కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం 15వ ఉప కులపతి నియామకం కోసం ఏర్పాటైన సెర్చ్ కమిటీ కీలక సమావేశం శనివారం ముగిసింది. వీసీ నియామకం కోసం ఏర్పాటు చేసిన త్రిసభ్య అన్వేషణ కమిటీ సభ్యులు జమ్మూ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య సంజీవ్ జైన్ (యూజీసీ నామిని), రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి (ప్రభుత్వ నామిని), జేఎన్‌టీయూ విశ్రాంత ఆచార్యులు ఆవుల దామోదర్ (కేయూ నామిని)లు హైదరాబాద్‌లోని సచివాలయంలో సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. కేయూ వీసీ పదవి కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల బయోడేటాలను క్షుణ్నంగా పరిశీలించారు. వడపోతల తర్వాత అత్యంత ప్రతిభగల మూడు పేర్లతో జాబితాను తయారు చేశారు. ఈ జాబితాను సీల్డు కవర్‌లో పొందుపరిచి రాష్ట్ర గవర్నర్‌కు పంపించినట్లు సమాచారం. కేయూతో పాటు రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల కోసం గత కొన్ని నెలలుగా జరుగుతున్న కసరత్తు కొలిక్కి వస్తోంది. కేయూ ఉప కులపతి పదవికి ఉన్నత విద్యామండలి దరఖాస్తులు ఆహ్వానించగానే సుమారు 158 మంది వరకు ఆచార్యులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో విశ్రాంత ఆచార్యులు కొందరు కాగా, కేయూతో పాటు, ఇతర విశ్వవిద్యాలయాల్లో ఆచార్యులుగా పనిచేస్తున్న వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం వీసీ నియామకాన్ని అత్యంత పకడ్బందీగా చేపట్టేందుకు సెర్చ్ కమిటీని నియమించింది. కేయూ గత వీసీ తాటికొండ రమేశ్‌పై పలు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఈ సారి వీసీ నియామకంలో పారదర్శకంగా వ్యవహరించాలని ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలో అన్వేషణ కమిటీ ఎంతో కసరత్తు చేసింది. తాజాగా ఒకసారి సెర్చ్ కమిటీ సమావేశం వాయిదా పడడంతో మళ్లీ ఎప్పుడు జరుగుతుందనే సందేహాలు వెల్లువెత్తాయి. వెంటనే శనివారమే సమావేశం కావడం గమనార్హం. త్వరలో కేయూకు వీసీగా బాధ్యతలు తీసుకునేది ఎవరన్నదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

కనులపండువగా గిరి ప్రదర్శన



జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: జఫర్‌గఢ్‌లోని పడమర కొండపై కొలువుదీరిన లక్ష్మీనరసింహస్వామి గిరి ప్రదర్శన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో శనివారం భక్తులు పాల్గొన్నారు. జఫర్‌గఢ్, వడ్డెగూడెం, పాతూరు మీదుగా సీతారామచంద్రస్వామి ఆలయం వరకు 30 మంది భక్తులు పాదయాత్రగా గిరి ప్రదర్శన నిర్వహించారు. ప్రజలు సుఖసంతోషాలతో, పాడి పంటలతో సమృద్ధిగా ఉండేలా చూడాలని స్వామిని వేడుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ చిటిమల్ల కృష్ణమూర్తి, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు రజితయాకయ్య, పల్లా సుధాకర్, సోమయ్య, నర్సయ్య, ధర్మయ్య, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బుగులు వెంకన్న కల్యాణం



చిల్పూర్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని చిల్పూర్‌గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారి వార కల్యాణ మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణలతో ప్రత్యేక పూజల నడుమ కల్యాణం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణం తిలకించి.. స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో మోహన్, అర్చకులు బి.రవీందర శర్మ, సౌమిత్రి శ్రీరంగాచార్యులు, కృష్ణమాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.